క్లుప్తంగా

రుణ ప్రణాళికపై శిక్షణ



శిక్షణ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గార: స్థానిక మండల వెలుగు కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లకు ఎస్‌హెచ్‌జీల 2025–26 ఆర్థిక రుణ ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం వి.సుజాత మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీవనోపాధి రంగాలపై నూతన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. రుణ ప్రణాళిక, జీవనోపాధి ప్రణాళికలు రెండు వేరువేరు యాప్‌ల్లో నమోదు చేయాలన్నారు. శిక్షణలో మండల మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు సుశీల, కోశాధికారి దమయంతి, సీసీలు పద్మ, సుధ, వెంకటరమణ, రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి



వెబ్‌సైట్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణ

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామం యూనిట్‌గా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీకాకుళం డీపీఎల్‌ఓ ఐ.వి.రమణ అన్నారు. అజ్జరాం గ్రామ సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎల్‌ఓ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళికలు పూర్తిచేసి, ఈ–గ్రామ స్వరాజ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటి పన్నులు శత శాతం వసూలు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లేశ్వరరావు ఉన్నారు.

261 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాం గ్రామంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ గుండ భాగ్యశ్రీ ప్రారంభించారు. 261 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కొంతమందిని ఉన్నత వైద్యం కోసం ఆస్పత్రికి రిఫర్ చేశారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు



దేవతామూర్తుల వేషధారణలోని విద్యార్థులతో సిబ్బంది

ఎచ్చెర్ల: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో మజ్జి మురళీకృష్ణ అన్నారు. లావేరు మండలంలోని బయ్యన్నపేట ఎంపీయూపీ పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అలాగే విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ కరుణసాగర్ ఇటీవల ఎన్‌ఎంఎంఎస్‌లో ఎంపికైన విద్యార్థులకు సైకిల్స్‌ను బహుమతిగా అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ హేమసుందర్, పీఎంసీ చైర్మన్ కె.ఆదినారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాప్ వినియోగంపై శిక్షణ

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంఎంఎస్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు యాప్ వినియోగంపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలుగు జిల్లా ఉన్నతి ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్బయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రతి సంఘానికీ జియో స్కానింగ్ చేయించి, సభ్యులకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో నమోదు చేయించాలన్నారు. సంఘ సభ్యులకు సంబంధించిన కుటుంబ ఆదాయ పరిస్థితి గుర్తిస్తూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారికి కావాల్సిన జీవనోపాధి నిమిత్తం ఎంత రుణం కావాలో నిర్ధారించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి గౌరీ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వై.మల్లేశ్వరి, ఎల్.చిన్నమ్మడు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి క్రైస్తవ లోకానికి తీరని లోటు అని పలు క్రైస్తవ సంఘాలు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపాయి. ఆయన గొప్ప వక్త, మానవతావాది అని కొనియాడారు. ఆయన యాక్సిడెంట్‌పై అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు.

మాతా శిశు సంరక్షణ..

అంగన్‌వాడీలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న కార్యకర్తలు

- పౌష్టికాహార లోపం, శిశు మరణాల రేటు తగ్గింపే లక్ష్యం
- ఐదేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య
- ప్రత్యేక దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. పోషణ్ 2.0 కింద ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులకు, బాలింతలకు, ఐదేళ్లలోపు చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పోషణ్ భీ–పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుంచి 'ఆదర్శిలా–నవచేతన కాన్సెప్ట్' పేరిట ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్త చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వ్యాక్సిన్లు, తల్లిపాల ఆవశ్యకతను వివరించాలని.. ఇలా పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు..

బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం శిక్షణలో వివరిస్తున్నారు. చాలాచోట్ల, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్ల లోపు వారికి వివాహాలు నిర్వహిస్తున్నారని, వీటిని అధిగమించేందుకు తల్లిదండ్రులకు ఏ విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు.

అంకితభావంతో పనిచేయాలి



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా చిన్నారులకు విద్యతో పాటు ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శిక్షణ అందించాం. ఎచ్చెర్ల ప్రాజెక్టు పరిధిలో 178 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ పొందారు. అంకితభావంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలి. – **దోల పాపినాయుడు, సీడీపీవో ఎచ్చెర్ల**

శిక్షణతో మేలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం, విద్యా బోధనపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ క్షేత్రస్థాయిలో ఎంతో ఉపయోగకరం. – **మహదాన్యం రాధిక, అంగన్‌వాడీ కార్యకర్త, జి.సిగడాం**

ఆరోగ్యంపై దృష్టి



శిక్షణ తరగతుల్లో చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం, ఇతర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. – **శ్రావణి, బెజ్జిపురం యూత్ సభ్యురాలు**

శిక్షణ ఉపయోగకరం



అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మెరుగైన విద్యా బోధనతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మిగిలిన అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. – **తమ్మినేని లక్ష్మి, సూపర్‌వైజర్, జి.సిగడాం**

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



గ్యారేజీ సిబ్బందికి సూచనలిస్తున్న శ్రీనివాసరావు



గ్యారేజీలో తనిఖీలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని ఆర్టీసీ సీఎంఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్యారేజీలోని టైర్లు, విడిభాగాల స్టోర్, డైలీ మెయింటెనెన్స్, బస్ ఇంజిన్, మెకానికల్ విభాగాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్యారేజీ సిబ్బందితో మాట్లాడుతూ ఏదైనా బస్‌కు కండక్టర్ గానీ, డ్రైవర్ గానీ బస్ మెయింటెనెన్స్ బుక్‌లో ఫిట్‌నెస్ కోసం రాస్తే దానిని తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. అలాగే టైర్లలో గాలి కూడా సరిపడా ఉండేటట్లు చూడాలన్నారు. తద్వారా బస్ మైలేజీ తగ్గకుండా ఉంటుందన్నారు. ఆయనతో పాటు ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు, గ్యారేజీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శక్తి యాప్ సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం అర్బన్: మహిళలు, విద్యార్థినులు శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ వాసుదేవరావు సూచించారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు, మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తీసుకొచ్చిన శక్తి యాప్‌ను సెల్‌ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆకతాయిలు అల్లరి చేస్తే సమాచారం పంపించిన 10 నిమిషాలకే సంఘటనా స్థలానికి చేరుకుని అల్లరిమూకల భరతం పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ సోమేశ్వరమ్మ, పోలీసు కానిస్టేబుల్స్ పి.ప్రభావతి, రామరాజు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకు నూతన విద్యా విధానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

గార: ప్రజాభిప్రాయం మేరకే పాఠశాలల విలీన ప్రక్రియను చేపడతామని, అందరి సమ్మతితోనే నూతన విద్యావిధానం ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందన్నారు. మూడు కిలోమీటర్ల పైబడి దూరం ఉన్న స్కూళ్లకు వెళ్లేవారికి అదనంగా రూ.6 వేలు అందించడం జరుగుతుందని తెలియజేశారు.

కొత్త డీఎస్సీ కోసమే నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని 6 స్కూళ్ల కాంప్లెక్సుల పరిధిలోని 38 స్కూళ్ల క్రమబద్ధీకరణపై వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, ఎంఈవో–1 ఎస్.రామకృష్ణ, ఎంఈవో–2 వినోదిని, గుండ భాస్కరరావు, గొండు వెంకటరమణమూర్తి, బడగల వెంకటప్పారావు, పీస రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలిపురంలో ఉన్న దర్బార్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో మూడు హారతులు, అభిషేకాలు చేపట్టారు. అలాగే భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సాయినాథుడు

మార్చి 31 వరకు పొడిగింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్న అసంఘటిత రంగ కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తిగా అంగవైకల్యం చెందినా వారి వారసులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ కె.అజయ్‌కార్తికేయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక శాంతినగర్ కాలనీలో ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రవీంద్ర భారతి స్కూల్ ప్రిన్సిపాల్ ఘోర చంద్‌పల్క అన్నారు. స్థానిక మండలవీధిలోని రవీంద్రభారతి పాఠశాలలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కవితా సదస్సుకు ఆహ్వానం



శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్‌లో ఏప్రిల్ 13న నిర్వహించే అంతర్జాతీయ కవితా సదస్సుకు తనకు ఆహ్వానం వచ్చినట్లు రచయిత జంధ్యాల శరత్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి కవులు హాజరవుతారని పేర్కొన్నారు.

వేణుగోపాలుడికి అష్టోత్తర పుస్తకార్చన



అష్టోత్తర పుస్తకార్చన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గార మండలంలోని శాలిహుండాంలో వెలసిన కాళియమర్దన వేణుగోపాల స్వామివారికి అష్టోత్తర పుస్తకార్చన గురువారం జరిగింది. కాశీని వేంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు విశ్వజయం సభ్యుల శ్రేయస్సు కోసం తమ స్వీయ రచన 'కృష్ణం వందే జగద్గురుం' అనే 108 పుస్తకాలని స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో అల్లూరి ఆనంద వర్మ, గురుగుబెల్లి ప్రశాంత్, వనజాక్షి, ప్రసన్నగాయత్రి, పొన్నాడ వంశీ, చాట్ల రాజారావు, అర్చకులు కిశోర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరం..



లావేరు మండలం అదపాక రోడ్డులో పాతకుంకాం వద్ద గెడ్డపై ఉన్న క్యాజ్ వేకు రక్షణ గోడ, కంచె వంటివి నిర్మించలేదు. వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్నా వాహనాలు కాలువలోకి వెళ్లిపోతాయి. ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. – **ఎచ్చెర్ల క్యాంపస్**

అలంకారప్రాయం



ఈ చిత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న రిఫ్రిజిరేటర్. విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలలు, విభాగాల్లో గత కొన్నేళ్ల క్రితం రిఫ్రిజిరేటర్లు ఏర్పాటు చేశారు. శుద్ధ జలాలు విద్యార్థులకు అందించేవారు. వేసవిలో విద్యార్థులకు రిఫ్రిజిరేటర్లు ఉపయోగకరంగా ఉండేవి. ప్రస్తుతం చాలావరకు మూలకుచేరాయి. వేసవి కాలంలో విద్యార్థులకు చల్లని నీరు అందటం లేదు. మరమ్మతులు సైతం చేయటం లేదు. – **ఎచ్చెర్ల క్యాంపస్**

సాగునీటి ప్రవాహం ఎలా?



ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం పంచాయతీ పరిధి నవభారత్ వద్ద నారాయణపురం కుడి కాలువలో చెట్లు పెరిగాయి. గత ఖరీఫ్‌లో సైతం ఈ చెట్లు కారణంగా నీటి ప్రవాహం ముందుకు సాగలేదు. ఈ చెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు. కాలువలో కిలో మీటర్ల మేర చెట్లు ఉన్నాయి. చెట్లు పెరగటంతో కాలువ స్వరూపం మారిపోయింది. – **ఎచ్చెర్ల క్యాంపస్**

పూర్వ ప్రాథమిక విద్య కీలకం



ఎచ్చెర్ల క్యాంపస్: శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ శరణ్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ, పూర్వ ప్రాథమిక విద్యపై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ గురువారంతో ముగిసింది. రిసోర్స్‌పర్సన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శరణ్య మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో పూర్వ ప్రాథమిక విద్య కీలకమన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, మూడేళ్లు దాటిన పిల్లలను పాఠశాల విద్యకు సన్నద్ధం చేయాలన్నారు. తల్లిదండ్రుల్లో సైతం విద్య పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణను ఐసీడీఎస్ పీఓ డి.పాపినాయుడు పర్యవేక్షించారు. సూపర్‌వైజర్ కె.అరుణకుమారి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

జి.సిగడాం: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని ఎచ్చెర్ల ప్రాజెక్ట్ సీడీపీఓ పాపినాయుడు అన్నారు. మండలంలోని సంతవురిటి జెడ్పీహెచ్‌ఎస్‌లో పోషణ్ బీ–పఢాయి బీ కార్యక్రమంలో భాగంగా గురువారంతో శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్‌లు తమ్మినేని లక్ష్మి, కుప్పిలి ఉమామహేశ్వరి, కె.కుమారి, బెజ్జిపురం యూత్ సభ్యులు శ్రవణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు గుణాత్మక విద్య అందించాలని ఏసీడీపీవో తులసీ లక్ష్మీ అన్నారు. మండలంలోని శాలిహుండం కార్యాలయం, కొర్ని పాఠశాలల్లో గత మూడు రోజులుగా గార, శ్రీకాకుళం రూరల్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ బీ – పఢాయి బీ శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని చిన్నారులకు మంచి విద్యను అందించాలన్నారు. ముఖ్యంగా పోషణకు సంబంధించి ఏమాత్రం అలసత్వం వద్దని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గార:మాట్లాడుతున్న ఏసీడీపీవో తులసీ లక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు పోషణ్ భీ పఢాయి భీ శిక్షణా తరగతులు టీపీఎం పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందించడంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధనా పద్ధతుల్లో మెలకువలపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.సీతామహలక్ష్మి, కల్యాణి, యశోద, కె.ఉమ, బి.యోగేశ్వరి, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: మాట్లాడుతున్న సీడీపీఓ పాపినాయుడు



శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం